RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 305 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ శనివారం 26 - 9 - 2026 పేజీలు : 4 వెల : రూ. 1 - 00

### కేదార్‌నాథ్‌లో 5 నెలల్లోనే 50 టన్నుల చెత్త.. మూడేళ్ల కంటే ఇదే అధికం!

ప్రముఖ శైవక్షేత్రమైన కేదార్‌నాథ్‌లో పర్యాటకుల రద్దీతో రోజురోజుకూ చెత్తాచెదారం ఎక్కువైపోతోంది. యాత్రికుల రద్దీ ప్రభావం కారణంగా.. ఈఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కేవలం ఐదు నెలల్లోనే సుమారు 50.30 మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. గత మూడేళ్లలో ఎన్నడూలేని విధంగా ఇంత భారీగా వ్యర్థాలు పేరుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని పంచాయతీ కార్యాలయం ఇచ్చిన సమాధానంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి.

### యూరియా యాప్‌తో ఇక్కట్లు..

లక్సెట్టిపేట(మంచిర్యాల): ఆన్‌లైన్‌లో యూరియా బుకింగ్‌తో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. వ్యవసాయానికి సంబంధించి ప్రస్తుతం అన్ని ఆన్‌లైన్ యాప్‌లతో కొనుగోలు చేసే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రస్తుతం యూరియాతో పాటు డీఏపీ, పొ టాస్, 20.20అన్ని కూడా ఆన్‌లైన్ చేసుకోవాలని ఎక్కడ స్టాక్ ఉంటే అక్కడ నుంచి తెచ్చుకోవాలన్న నిబంధనలు పెట్టడంతో రైతులు నానా తంటాలు పడుతున్నారు. కొంత మంది రైతులకు యాప్‌లపై అవగాహన కూడా లేకపోవడం ఒకెత్తయితే మరికొంత మందికి అసలు స్మార్ట్ ఫోన్లుకూడా లేకపోవడం మరో సమస్య.

### సీఎం రేవంత్ రెడ్డికి

## 'ఆర్యదాన్ ముహమ్మద్' అవార్డు

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. కేరళకు చెందిన ప్రతిష్ఠాత్మక ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ అందజేస్తున్న 'ఆర్యదాన్ ముహమ్మద్ -- 2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. తెలంగాణలో ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధతతో పాటు రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం ఆయన అమలు చేస్తున్న వినూత్న పథకాలు, దూరదృష్టి గల నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ ప్రకటించారు. ఈ అవార్డు ప్రదానోత్సవం కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జరగనుంది. దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్యదాన్ ముహమ్మద్ 4వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అవార్డును స్వీకరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కేరళ చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన



కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్ స్మారకోపన్యాసం చేయనున్నారు. రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను రేవంత్ రెడ్డికి అందజేయనున్నారు.

### దీన్‌దయాళ్ ఆలోచనలే

## వికసిత్ భారత్‌కు దిక్సూచి

**- దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా మోదీ నివాళి- వ్యక్తి ప్రగతి సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంతమని వెల్లడి-అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనేదే అంత్యోదయ లక్ష్యమని వ్యాఖ్య**


**న్యూఢిల్లీ,సెప్టెంబర్,25:**స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథాన్ని అందించిన మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తే బీజేపీకి, తమ ప్రభుత్వాల నిర్ణయాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. వ్యక్తి ప్రగతి సమాజం నుంచి వేరుగా కాకుండా, సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంత సారమని చెప్పారు. ప్రకృతిని దెబ్బతీయకుండా సమాజం పురోగమించేలా అభివృద్ధి నమూనా ఉండాలని ఆయన ఆలోచనలు చెబుతాయని వివరించారు. దీన్ దయాళ్ జయంతి సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరడమే అంత్యోదయ లక్ష్యమని మోదీ గుర్తుచేశారు. ఏకాత్మ మానవతావాదాన్ని వివరిస్తూ, వ్యక్తి ఎదుగుదలతో పాటు సమాజం, ప్రకృతి, దేశం మధ్య సమతుల్యత ఉండాలని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారని ప్రధాని పేర్కొన్నారు. కేవలం ఆర్థిక వృద్ధే అభివృద్ధి కాదని, అందులో సామాజిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కూడా భాగస్వామ్యం



కావాలని ఆయన భావించినట్లు తెలిపారు. పేదల సంక్షేమం, సమాజంలోని అట్టడుగు వర్గాల సాధికారత, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమిస్తూ తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని మోదీ వివరించారు. స్ఫూర్తితోనే సమగ్ర, అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగా 'వికసిత్ భారత్' నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.

## బాలాపూర్ లడ్డూ వేలం..

## రూ.39 లక్షలకు ప్రణీత్ రెడ్డి సొంతం



హైదరాబాద్, సెప్టెంబర్ 25: భాగ్యనగరంలో ఎంతో ప్రత్యేకత ఉన్న బాలాపూర్ వినాయకుడి లడ్డూనురూ.39 లక్షలకు సామ ప్రణీత్ రెడ్డి దక్కించుకున్నారు. గతేడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ ధర రూ.35 లక్షలు పలుకగా.. ఈ సారి రూ.4 లక్షలు అదనంగా లడ్డూ ధర పలికింది. అర్బన్ గ్రూప్‌కు చెందిన ప్రణీత్ రెడ్డి లడ్డూను వేలం పాటలో దక్కించుకున్నారు. అలాగే ఈ వేలం పాటలో మర్రి రవికిరణ్ రెడ్డి (చంపాపేట్), కేవీఏ ఫ్లవర్ మర్చంట్– కందాడ శాలిని వీరేందర్ రెడ్డి (చంపాపేట్), కంచర్ల శివా రెడ్డి ది సుషీ కో– సామ దయానంద్ రెడ్డి ఢ సామ వరణంద్ రెడ్డి(లండన్), జీఎన్‌ఆర్ డెవలపర్స్ – గడ్డం నవీన్ రెడ్డి (హస్తినాపురం), శ్రీకాంత్– పీఎస్‌కే గ్రూప్, ఇబ్రాం ప్రత్యూష్ (బాలాపూర్) పాల్గొన్నారు. చివరకు రూ.39 లక్షలకు ప్రణీత్ రెడ్డి లడ్డూను సొంతం చేసుకున్నారు. 21 కిలోల బాలాపూర్ గణేశుడి లడ్డూ కోసం 9 మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో ఐదు కంపెనీలు ఉండటం విశేషం. కేవలం లడ్డూ కోసమే ఎన్‌ఆర్‌ఐలు బాలాపూర్‌కు తరలివచ్చారు. 1994లో లడ్డూ వేలం పాట మొదలవగా.. రూ.450 ధర పలికింది. ఇక అప్పటి నుంచి లడ్డూ ధర అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది రూ.39 లక్షలకు చేరింది. బాలాపూర్ వినాయకుడి లడ్డూను సొంతం చేసుకుంటే సుఖసంతోషాలతో పాటు సిరిసంపదలూ కలుగుతాయని భక్తుల నమ్మకం. లడ్డూ వేలం ముగిసిన అనంతరం బాలాపూర్ గణేశ్ విగ్రహం నిమజ్జనం ఊరేగింపు ప్రారంభమైంది. బాలాపూర్ వినాయకుడిని హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయనున్నారు.

## యూపీని పెట్టుబడుల స్వర్గధామంగా మార్చాం

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**లక్నో,సెప్టెంబర్,25:**ఉత్తరప్రదేశ్‌లో ఒకప్పుడు నేరగాళ్లు, మాఫియా శక్తుల రాజ్యమేలుతుండగా.. నేడు పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు అనుకూలమైన సురక్షిత ప్రాంతంగా రాష్ట్రం అవతరించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. గ్రేటర్ నోయిడాలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైన 'యూపీ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో 2026' సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2017లో ముఖ్యమంత్రిగా యోగి ఆదిత్యనాథ్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా మాఫియా నెట్‌వర్క్‌ను విజయవంతంగా తుదముట్టించారని ప్రశంసించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పటిష్టం కావడంతోనే పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం పెరిగి, భారీగా పెట్టుబడులు తరలి వచ్చేందుకు అనువైన వాతావరణం ఏర్పడిందని ఆయన వివరించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని స్థిరమైన పాలన దేశానికి అసలైన బలమని అమిత్ షా స్పష్టం చేశారు. వరుసగా మూడోసారి ప్రధానిగా ప్రజల విశ్వాసాన్ని పొందిన మోదీ.. దేశ ప్రయోజనాలకు అనుగుణంగా దూరదృష్టితో విధానాలను రూపొందించడమే కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి చూపారని పేర్కొన్నారు. పరిస్థితులకు అనుగుణంగా పాత విధానాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సరికొత్త పారిశ్రామిక సంస్కరణలను అమలు చేయడం వల్లే భారతదేశం నేడు ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా రూపాంతరం చెందిందని అమిత్ షా పునరుద్ఘాటించారు.

## పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించండి

### జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో తీర్మానం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు పూర్తి స్థాయిలో రాష్ట్ర హోదాను పునరుద్ధించాలని కోరుతూ ఇవాళ ఆ రాష్ట్ర అసెంబ్లీలో సీఎం ఒమర్ అబ్దుల్లా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీంతో సభలో గందరగోళం నెలకొన్నది. ట్రెజరీ బెంచీలు, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాత.. సీఎం ఒమర్ ఆ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తొలుత 2000 జూన్ 26న, ఆ తర్వాత 2024, నవంబర్ 6వ తేదీల్లో ఇదే సభలో తీర్మానాన్ని పాస్ చేశామని, అయితే తాజా తీర్మానం పట్ల కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, జమ్మూకశ్మీర్‌కు పూర్తి స్థాయిలో రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఆయన కోరారు. జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి స్వయంప్రతిపత్తి కల్పించాలని కోరుతూ 2000 సంవత్సరంలో ఎన్‌సీ నేతృత్వంలోని ఫారూక్ అబ్దుల్లా




ప్రభుత్వం తీర్మానాన్ని అసెంబ్లీలో పాస్ చేసింది. 2019లో రద్దు చేసిన ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలని కోరుతూ 2024లో అసెంబ్లీ తీర్మానించింది. జమ్మూకశ్మీర్‌కు పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను కల్పిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఆ హోదాను పునరుద్ధరించాలని ఒమర్ అబ్దుల్లా తెలిపారు.

### అక్టోబర్ 2 నుంచి

## కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యాప్త ఆందోళనలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,25:** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి పిలుపునిచ్చింది. జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోకపోతే అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ముంబై వేదికగా దేశవ్యాప్త ఆందోళనలను ప్రారంభిస్తామని సీజేపీ జాతీయ కన్వీనర్ అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేస్తూ.. "జ్ఞానేశ్ కుమార్ శనివారంలోగా రాజీనామా చేయకపోతే, అక్టోబర్ 2న ముంబై నుంచి నిరసనలను ప్రారంభించి, దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు ఈ ప్రజా ఉద్యమాన్ని విస్తరిస్తాం. ఈ గాంధీ జయంతి వేళ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుం టామని ప్రతిజ్ఞ చేద్దాం" అని హెచ్చరికలు జారీ చేశారు.ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎ×=) ప్రక్రియలో భాగంగా ఇతర ఎన్నికల కమిషనర్లను పక్కనపెట్టి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం, కోట్ల సంఖ్యలో ఓట్ల తొలగింపు వంటి అంశాలపై తీవ్ర ఆరోపణలు వస్తున్న తరుణంలో సీజేపీ ఈ అల్టిమేటం విధించింది. ఓటు హక్కును హరిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను కాలరాసే



విధానాలను సహించేది లేదని, రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశవ్యాప్త పోరాటానికి ఇది సరైన సమయమని పార్టీ నేతలు పేర్కొన్నారు. సీఈసీ తన పదవి నుంచి వైదొలగకపోతే ఢిల్లీలో 'జం తర్ మంతర్ 2.0' తరహా భారీ ప్రజా నిరసనలు తప్పవని హెచ్చరించ డంతో జాతీయ రాజకీయాల్లో ఎన్నికల సంఘం వివాదం మరింత వేడెక్కింది.

## యూపీఐ లావాదేవీలపై చార్జీలు..

### వినియోగదారులకు భారం లేదన్న నిర్మలా సీతారామన్

**-ఎండీఆర్ చార్జీలపై వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న నిర్మల**

**- ఈ చార్జీలు కేవలం వ్యాపారులకు మాత్రమే పరిమితమని స్పష్టీకరణ**

**- నిబంధనలపై అవగాహన లోపం వల్లే అపోహలు వ్యాపిస్తున్నాయని వ్యాఖ్య**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,25:**యూపీఐ డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) చార్జీలు విధించనున్నారనే ప్రచారంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టత ఇచ్చారు. ఈ అంశంతో సాధారణ ఖాతాదారులు లేదా వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి జేబుపై ఎలాంటి అదనపు భారం పడదని తెలిపారు. రూ.2,000కు మించిన కొన్ని నిర్దిష్ట డిజిటల్ లావాదేవీలకు ఎండీఆర్ వర్తించినా, అది వినియోగదారులకు కాదని, వ్యాపారులకే పరిమితమని మంత్రి చెప్పారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు స్పష్టతనిచ్చారు. ఎండీఆర్ అనేది కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే పన్ను, సెస్ లేదా సర్‌చార్జ్ కాదని... ఆ మొత్తం ప్రభుత్వ ఖజానాకు వెళ్లదని స్పష్టం చేశారు. బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలు వంటి డిజిటల్ చెల్లింపు వ్యవస్థ నిర్వహణకు సంబంధించిన ఖర్చుల కోసం ఈ రుసుము ఉంటుందని వివరించారు. ఎండీఆర్ నిబంధనలపై అవగాహన లోపం వల్లే అనవసర అపోహలు వ్యాపిస్తున్నాయని అన్నారు. ఇప్పటికే డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిగే చెల్లింపుల్లో వ్యాపారులు ఇలాంటి రుసుములను భరిస్తున్నారని గుర్తుచేశారు. యూపీఐ చెల్లింపుల విషయంలోనూ ఈ చార్జీని కస్టమర్లపైకి నెట్టే



అవకాశం ఉండదని మంత్రి తేల్చిచెప్పారు. డిజిటల్ చెల్లింపులను ఉపయోగించే ప్రజలకు సేవలు ఉచితంగానే, ఎప్పటిలాగే అంతరాయం లేకుండా అందుబాటులో ఉంటాయని తెలిపారు. తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు గందరగోళానికి గురికావొద్దని సూచించిన ఆమె, ఎండీఆర్ ద్వారా వసూలయ్యే సొమ్ము డిజిటల్ పేమెంట్ నెట్‌వర్క్ నిర్వహణలో భాగస్వామ్యమైన బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థల వ్యవస్థాపక వ్యయాలకే ఉపయోగపడుతుందని వివరించారు.

## సిక్కింలో విరిగిపడిన భారీ కొండచరియలు

పశ్చిమ సిక్కింలోని రింబి గ్రామంలో గురువారం రాత్రి భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో బురద, రాళ్లు జనావాసాలవైపు దూసుకురావడంతో అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. విరామం లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల గ్యాల్‌షింగ్ జిల్లాలోని యక్సోమ్–తాషిడింగ్ ప్రాంతంలో ఈ కొండచరియలు విరిగిపడ్డాయి. విద్యుత్ శాఖకు చెందిన ప్రభుత్వ క్వార్టర్లతో సహా అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇలా కొండచరియలు విరిగిపడటం ఇదే మొదటిసారి కాదు. రింబి, దాని చుట్టుపక్కల ఉన్న సింగ్లిటమ్ ప్రాంతాలు గత నెల నుంచి కొండచరియలు విరిగిపడుతూనే ఉన్నాయి. దీంతో ఈ పరిస్థితికి కారణం ఏంటి అని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొండచరియలు విరిగిపడటానికి ప్రధాన కారకాలు వర్షం, వాలు, నీటిపారుదల, భూగర్భం అని సిక్కింపై జరిపిన పరిశోధన లో వెల్లడైంది. ఈ ప్రాంతంలో అనేక కొండచరియలు విరిగిపడటానికి వర్షమే తక్షణ కారణం. నీరు నేలలోకి, పగిలిన రాళ్లలోకి



చేరినప్పుడు భూమిలోపల ఒత్తిడి పెరిగి వాలును పట్టి ఉంచే బలం తగ్గుతుంది. ఏటవాలుగా ఉన్న భూభాగంలో ఇది నేల, రాళ్లు కిందికి జారిపడటానికి కారణమవుతుంది. సిక్కిం హిమాలయ పర్వత ప్రాంతం కావడం వల్ల ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. నిటారుగా, కఠినమైన భూభాగం, టెక్టోనిక్ ప్లేట్ కదలికల వల్ల ఇక్కడ భూగర్భ నిర్మాణం సంక్లిష్టంగా ఉంటుంది.

# సంపాదకీయం

## ఇండియా ఆపరేషన్ సముద్ర

చంద్రుడి గుట్టు మట్లు తెలుసుకుంది. సూర్యుడి మీద కూడా ప్రయోగాలు చేస్తోంది. అంతరిక్షంలో భారతీయ జెండాలు రెపరెపలాడించింది. నింగి, నేల, అంతరిక్షం.. ఇలా మూడు విభాగాలలో భారత్ తన సత్తాను చూపించింది. ఇకపై నీటిలో కూడా తన సామర్థ్యాన్ని నిరూపించుకోబోతోంది. అంతరిక్ష ప్రయోగాలతో ప్రపంచాన్ని మొత్తం తన వైపు తిప్పుకున్న భారత్.. ఇప్పుడు సముద్రంలో కూడా ప్రయోగాలను మొదలు పెట్టబోతోంది. ఎందుకంటే సముద్రంలో విపరీతమైన ఖనిజాలు.. విలువైన నిక్షేపాలు ఉన్నాయి. ఆ విలువైన నిక్షేపాలను గనుక బయటికి తీస్తే భారత ఆర్థిక ముఖ చిత్రం పూర్తిగా మారిపోతుంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో అతి త్వరలోనే సముద్రయాన్ ప్రాజెక్టుతో సముద్రపు లోపల ఉన్న రహస్యాలను తెలుసుకునేందుకు కీలక ప్రయోగం చేపట్టనుంది.. రెండేళ్ల క్రితమే సముద్రయాన్ ప్రాజెక్టును ఇస్రో అనౌన్స్ చేసింది.. అందుకోసం ప్రత్యేక సబ్ మెరైన్ ను రూపొందించింది. సముద్రయాన్ మిషన్ అనే ప్రయోగం ద్వారా మహా సముద్రాల అన్వేషణలో భాగంగా సముద్రాల లోపల ఉన్న ఖనిజ సంపదను అన్వేషించడానికి భారత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తలు మరో అడుగు ముందుకు వేసి మహా సముద్రాలలో ఉన్న ఖనిజ సంపదను కనుగొనేందుకు మత్స్య 6000 అనే సబ్ మెర్సిబుల్ మిషన్ ద్వారా చెన్నై తీరంలోని 5 వేల మీటర్ల లోతులో ప్రయోగాత్మక ప్రయోగాలు చేపట్టారు. ఆ తర్వాత మరింత లోతులో పరిశోధనలు చేపట్టనుంది. మన దేశ పరిశోధకులు సముద్రయాన్ ప్రయోగాన్ని మొదలుపెట్టారు. ఈ ప్రయోగంలో భాగంగా చెన్నై ఆధ్వర్యంలో నాలుగో తరం సబ్ మెరైన్ మత్స్య 600 ను మే నెలలో సముద్ర జలాల్లోకి ప్రవేశపెడతారు. డీప్ ఓషియన్ మిషన్ లో భాగంగా ఈ సబ్ మెరైన్ ను రూపొందించారు. 500 మీటర్ల లోతు వరకు ముగ్గురు ఆక్వా నాట్స్ ఇందులో ప్రయాణిస్తారు. ఒకవేళ కనుక ఈ ప్రయోగం విజయవంతం అయితే అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, జపాన్ సరసన భారత్ నిలుస్తుంది. సముద్ర జలాల్లో విలువైన నిక్షేపాలతో పాటు, అరుదైన ఖనిజాలు కూడా ఉన్నాయి. కాకపోతే వీటిని అన్వేషించడం అంత సులువు కాదు. సముద్ర అంతర్భాగంలో అత్యంత కఠినమైన వాతావరణం ఉంటుంది. సముద్రాలలో నిత్యం జలాలు ఆటుపోట్లకు గురవుతుంటాయి. అంతర్భాగంలో కూడా విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. అలాంటప్పుడు అందులో ప్రయోగాలు చేయడం కత్తి మీద సాము లాంటిది. సబ్ మెరైన్ లు కూడా కొన్ని సందర్భాలలో ప్రమాదాలకు గురవుతుంటాయి. ఇన్ని ప్రతికూలతలు ఉన్నాయి కాబట్టి.. సముద్రంలో ప్రయోగాలు చేయడం అంత ఈజీ కాదు. సముద్ర గర్భంలో నిక్షేపాలను బయటకు తీస్తే.. వాటి ద్వారా ఎంతో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని సొంతం చేసుకోవచ్చు. ప్రయోగం విజయవంతం అయితే 2026 లేదా 2027 చివరిలో మానవ సహిత సముద్రయాన్ ప్రాజెక్ట్ ను ఇస్రో జరుపనుంది. 28 టన్నులు బరువు కలిగిన మత్స్య 6000 అనే సబ్ మెరైన్ మిషన్ ద్వారా ఈ ప్రాజెక్ట్ ను జాతీయ మహా సముద్ర సాంకేతిక సంస్థ ద్వారా ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్ పర్యవేక్షణలో సముద్రయాన్ మిషన్ ను పూర్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో మానవ సహిత గా ముగ్గురు శాస్త్రవేత్తలను ఎంపిక చేసి ఇందులో ప్రయాణించనున్నారు. అంతరిక్షంలో పరిశోధనలు చేపట్టే శాస్త్రవేత్తలను ఆస్ట్రోనాట్స్ గా పిలుస్తారు. సముద్రం లోపల పరిశోధనలు చేసే వాళ్లను ఆక్వానాట్స్ గా పిలుస్తారు. ఫ్రాన్స్ సహకారంతో భారత్ సముద్రయాన్ ప్రయోగాన్ని చేపడుతుంది. ఇందులో ముగ్గురు శాస్త్రవేత్తలు సబ్ మెరైన్ లో వెళ్లి పరిశోధన చేస్తారు. అందులో ఇద్దరు భారత కు చెందిన శాస్త్రవేత్తలు ఇప్పటికే పరిశోధనలు మొదలుపెట్టారు. వారిలో జితేంద్ర పాల్ సింగ్, రాజు రమేష్ లు ఇప్పటివరకు 5000 మీటర్ల లోతు వరకు డైవ్ చేసిన భారత్ రికార్డుగా ఈ ప్రయోగం ద్వారా సాధించారు. ఈ సబ్మెర్సిబుల్ 12 గంటల పాటు పనిచేస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో 96 గంటల వరకు కూడా సముద్రంలో ఉండే సామర్థ్యం కలిగి ఉంది. ప్రయోగం ద్వారా సముద్రంలో ఉన్న ఖనిజాలు, ఖనిజ సంపద, మినరల్స్, కోరల్స్ వంటి ఖనిజాలతో పాటుగా సము ద్రంలో ఉన్న ఇసుకలో కూడా ఏతరహా ఖనిజాలు ఉన్నాయి.. వాటి ఉపయోగాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. ఈ తరహా ప్రయోగాలను ఇప్పటివరకు అమెరికా, రష్యా, ఫ్రాన్స్, జపాన్, చైనా లాంటి దేశాలు మాత్రమే చేశాయి.. ఇప్పుడు ఇస్రో కూడా ఈ దేశాల సరసన చేరనుంది. ఇస్రో శాస్త్రవేత్తలు ఈ ప్రయోగానికి సంబంధించిన పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో ఇస్రో ఒకవైపు గగన్ యాన్ ద్వారా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపేందుకు సిద్ధమవుతూ నే సముద్రం లోపల శాస్త్రవేత్తల ద్వారా అత్యంత క్లిష్టమైన కీలకమైన ప్రయోగ ప్రక్రియను పూర్తిచేసే దశలో ఉండటం గర్వకారణమ నిపలువురు పేర్కొంటున్నారు. ఫలితంగా భారత ఆర్థిక ముఖ చిత్రంపూర్తిగా మారిపోతుంది. భారత్ అభివృద్ధి చెందినదేశంలాకాకుండా..అభివృద్ధి చెందిన దేశంగా రూపాం తరంచెందుతుంది. ఉపాధి కోసం మన దేశ యువత విదేశా ల కు వెళ్లకుండా.. ఇక్కడే పనిచేసే పరిస్థితి ఏర్పడుతుంది.

పబ్లిషర్ : కొక్కు రవికుమార్

# మారణహోమంలో కాసుల వేట..?




వాషింగ్టన్: దేశాల మధ్య యుద్ధం జరిగి... వేలమంది ప్రాణాలు కోల్పోతుంటే... వాటి ఆధారంగా లాభాలు గడిస్తున్న దారుణ పరిస్థితికి వైట్ హౌస్ ఆధారం కావడం ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. యుద్ధం జరిగితే కొందరికి లాభం. వ్యాపారవేత్తే దేశాధ్యక్షుడు అయితే 'నాకేంటి?' అని అలోచించకుండా ఉంటాడా? ఇరాన్ – ఇజ్రాయిల్, అమెరికా యుద్ధంలో ఇప్పుడిదే తీవ్ర చర్చగా మారింది. ఈ యుద్ధ సమాచారంతో ఇజ్రాయిల్, అమెరికాకు చెందిన అనేక కార్పొరేట్ కంపెనీలు వేలకోట్ల ఇన్సైడర్ ట్రేడింగ్ చేస్తున్నాయనే సమాచారం వెలుగుచూసింది. ఇరాన్పై ఆయా దేశాలు దాడులు చేయకముందు ఆ కంపెనీల షేర్ల ధరలు ఎంత ఉన్నాయి? ఇప్పుడెలా పెరిగాయి? అనే సమాచారాన్ని అంతర్జాతీయ మీడియా ప్రస్తావిస్తోంది. అందరి వేళ్లు వైట్హౌస్ వైపే చూపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్వతహాగా కార్పొరేట్ వ్యాపారి కావడంతో 'రహస్య యుద్ధ సమాచారం ఆధారంగా జరుగుతున్న ఇన్ సైడర్ ట్రేడింగ్పై ఆధారాలతోసహా అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2026 ఫిబ్రవరి 28న ఇరాన్ యుద్ధం ప్రారంభం ముందూ, తర్వాత కీలక రహస్య సమాచారం ద్వారా కొద్ది మంది స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టి భారీగా రాబడులను పెంచుకున్నారు.

ప్రభుత్వ విధాన నిర్ణయాలు బహిరంగం కావడానికి కొన్ని గంటల ముందే దానికి అనుగుణంగా ట్రేడింగ్ జరగడం వెనుక వైట్ హౌస్ నుంచి అందుతున్న ముందస్తు సమాచారమే కారణమనే అనుమానాలు బలపడుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధ రహస్య సమాచారాన్ని ఉపయోగించుకుని అమెరికాలోని కొందరు ట్రేడర్లు మార్కెట్లో దాదాపు 1.5 బిలియన్ల నుంచి 1.8 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.15 వేల కోట్లు) విలువైన అనుమానాస్పద లావాదేవీలు జరిపినట్టు అంచనా. ముఖ్యంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనలు వెలువడటానికి కొన్ని నిమిషాల ముందే చమురు మార్కెట్లలో భారీ ఎత్తున బెట్టింగ్లు జరగడం, తద్వారా అజ్ఞాత వ్యక్తులు కోట్లాది రూపాయల లాభాలను ఆర్జించడం ఇన్సైడర్ ట్రేడింగ్ అనుమానాలను బలపరుస్తున్నాయి. ప్రారంభంలో ఇన్సైడర్ ట్రేడింగ్ ఆరోపణలను కొట్టిపారేసిన వైట్ హౌస్ ఇప్పుడు స్వరం మార్చింది. సున్నితమైన సమాచారంతో ముడి పడి ఉన్న ఫ్యూచర్స్ మార్కెట్లలో బెట్టింగ్లు కట్టవద్దని తన సిబ్బందిని హెచ్చరించింది.

**ఇవిగో సాక్ష్యాలు..:** ఈ ఏడాది జనవరిలో వెనిజులాలో అమెరికా సైనిక చర్యకు దిగడానికి ముందే పాలీమార్కెట్ వంటి ముందస్తు మార్కెట్లలో అనుమానాస్పద బెట్టింగ్లు కనిపించాయి. మార్చి మొదటి వారంలో ఇరాన్పై అమెరికా దాడి చేయబోతోందని అధికారికంగా తెలియడానికి కొన్ని గంటల ముందే కొందరు బెట్టింగ్లు కాశారు. కొద్దిమంది అజ్ఞాత ట్రేడర్లు ఏకంగా 1.2 మిలియన్ల లాభాన్ని పొందడం వెనుక ఇన్సైడర్ సమాచారం ఉందనే అనుమానం ఉంది. మార్చి 23 ఉదయం అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ దాడుల నిలిపివేత గురించి ట్వీట్ చేసే కొద్ది నిమిషాల ముందే, మార్కెట్లో సుమారు 500 నుండి 830 మిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ ఫ్యూచర్స్ చేతులు మారాయి. ప్రకటన రాగానే చమురు ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో ఆ ముందస్తు ట్రేడర్లు ఊహించని లాభాలు పొందారు. ఇది చరిత్రలోనే అతిపెద్ద ఇన్సైడర్ ట్రేడింగ్ కేసు కావచ్చని చట్టసభ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా ఇరాన్ మధ్య 15 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం ప్రకటించడానికి గంటల ముందు సుమారు 950 మిలియన్ డాలర్ల విలువైన చమురు బెట్టింగ్లు జరిగాయి. ప్రకటన తర్వాత చమురు ధరలు 15 శాతం పడిపోవడంతో ఆ ముందస్తు ట్రేడర్లు మళ్లీ భారీగా లాభపడ్డారు..

**ఇన్సైడ్ ట్రేడింగ్ అంటే...:** ప్రభుత్వ నిర్ణయాలు, యుద్ధ సంబంధిత గోప్య సమాచారం ముందుగానే తెలుసుకుని, ఆ సమాచారాన్ని ప్రజలకు వెల్లడించే ముందు స్టాక్ మార్కెట్లలో లావాదేవీలు చేయడాన్ని ఇన్సైడ్ ట్రేడింగ్ అంటారు. అమెరికాలో ఇది చట్ట విరుద్ధం. దీన్ని యుఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) పర్యవేక్షిస్తుంది. రహస్య ప్రభుత్వ సమాచారాన్ని ప్రభుత్వంలో ఉన్నవారు కార్పొరేట్ లాబీలకు ముందుగానే తెల పడంతో ఈ ఇన్సైడర్ ట్రేడింగ్ జరుగుతుంది. ఈ విషయం తెలియని సామాన్య ప్రజలు లక్షల కోట్లు నష్టపోతారు. ఆ సొమ్మంతా 'ఇన్సైడర్ల ఖాతాల్లోకి వెళ్లిపోతుంది.

**యుద్ధానికి ముందు...:** అమెరికా ఏ దేశంపైనైనా దాడులు చేయడం మొదలు పెట్టడానికంటే ముందు ఆ దేశ రక్షణ కంపెనీలైన లాకోద్ మార్టిన్, రైథియోన్ టెక్నాలజీస్ వంటి సంస్థల షేర్లు వేగంగా పెరుగుతుంటాయి. ఈ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేది ప్రధానంగా అమెరికాలోని ప్రధాన రాజకీయపార్టీల నేతలే కావడం గమనార్హం !

**ఆయిల్ మార్కెట్లో...:** ఇరాన్తో ఉద్రిక్తతలు పెరిగే ముందు క్రూడ్ ఆయిల్ ఫ్యూచర్స్లో భారీ కొనుగోళ్లు నమోదయ్యాయి, యుద్ధ వార్తలు వెలువడిన వెంటనే ధరలు పెరగడంతో, ఈ లావాదేవీలు చేసినవారికి అనూహ్య లాభాలు వచ్చాయి. ఇన్సైడర్ ట్రేడింగ్ వల్లే ఇది సాధ్యమైందనే అనుమానాలకు అనేక ఆధారాలు లభించాయి.

**వీరే వారు ...:** అమెరికాలో కొంతమంది ఎంపీలు, ఉన్నతాధికారులు తమకు లభించే గోప్య సమాచారం ఆధారంగా స్టాక్స్ కొనుగోళు , అమ్మకాలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అమెరికా అధ్యక్షుడే పెద్ద వ్యాపారవేత్త కావడంతో ఆయన సంపద పెరుగుదల పైనా 'ఇన్ సైడర్' అనుమానాలు బలపడుతున్నాయి. ఇరాన్ అమెరికా ఉద్రిక్తతలు జియోపొలిటికల్ అంశమే కాదనీ, ఆర్థిక మార్కెట్లలో గోప్య లాభాల రాజకీయంగా కూడా మారుతున్నాయని నిరూపితమవుతున్నాయి.

**గతంలోనూ...:** ఇన్సైడ్ ట్రేడింగ్ కేసుల్లో గతంలో అమెరికాకు చెందిన కొన్ని కంపెనీలు, వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. అమెరికాలో అత్యంత పెద్ద ఇన్సైడ్ ట్రేడింగ్ కేసుల్లో రాజ్ రాజరత్నం కేసు ఒకటి. గల్లియన్ గ్రూప్ అనే వైట్ హౌస్ యుద్ధ సమాచారంతో సరదాగ గరుడుడు మార్కెట్లలో భారీ వ్యాపారం.. వేల కోట్లు ఆర్జిస్తున్న కంపెనీలు గతంలో కొన్ని కేసుల్లో నిందితులకు శిక్షలు అయినా తీరుమారని కార్పొరేట్లు హెడ్జ్ ఫండ్ ద్వారా రాజ్ రాజరత్నం గోప్య సమాచారం ఆధారంగా ట్రేడింగ్ చేశాడని ఆరోపణలు వచ్చాయి. టెక్నాలజీ కంపెనీల్లోని ఉన్నతాధికారుల నుంచి సమాచారం సేకరించినట్టు నిరూపితమవడంతో 2011లో కోర్టు అతన్ని దోషిగా తేల్చి 11 ఏళ్ల జైలుశిక్ష విధించింది. ఈ కేసు ద్వారా ఇన్సైడ్ సమాచారం ఆధారంగా భారీ లాభాలు పొందడం ఎలా జరుగుతుందో బాహ్య ప్రపంచానికి స్పష్టంగా తెలిసింది.

మరో కేసులో ప్రముఖ వ్యాపారవేత్త మార్తా స్టీవర్ట్ ఇమ్ క్లోన్ సిస్టమ్స్ కంపెనీ షేరు పడిపోతుందనే గోప్య సమాచారం ముందే తెలుసుకుని అమ్మేసింది. ఆ తర్వాత ఆమెపై కేసు నమోదు చేసి శిక్ష విధించారు. అమెరికా ఎంపీ క్రిస్ కొలిన్స్ ఒక బయోటెక్ కంపెనీ విఫలమవుతుందని ముందే తెలుసుకుని తన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు షేర్లు అమ్మి నష్టాన్ని తప్పించుకున్నారు.

**తాజాగా ...:** ఇరాన్ ఉద్రిక్తతల సమయంలో అమెరికాకు చెందిన ఆయిల్ ఫ్యూచర్స్, డిఫెన్స్ కంపెనీల షేర్లలో అసాధారణ పెరుగుదల కనిపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుధ తయారీ సంస్థల్లో ఒకటైన లాక్హీడ్ మార్టిన్ కంపెనీ యుద్ధ ఉద్రిక్తతల సమయంలో షేర్ల ధరలు అనూహ్యంగా పెరుగుతుండటం గమనార్హం. వ్యాన్గార్డ్, బ్లాక్క్ వంటి ఇన్వెస్ట్మెంట్ ఫండ్స్ పబ్లిక్ కంపెనీ, మిస్సైల్స్, రాడార్ టెక్నాలజీ తయారీ సంస్థ అయిన రైథియన్ టెక్నాలజీస్ షేర్లు కూడా భారీగా పెరిగాయి. ఈ సంస్థలు అమెరికా రక్షణ శాఖతో పెద్ద పెద్ద కాంట్రాక్టులు చేస్తుంటాయి. మధ్యప్రాచ్య దేశాలకు సరఫరా పెరిగినప్పుడల్లా ఈ కంపెనీల లాభాలు అనూహ్యంగా పెరుగుతుండటం గమనార్హం !

**సహించం: వైట్ హౌస్:** వైట్ హౌస్ మొదట ఈ ఆరోపణలను పట్టించుకోకపోయినా ఏప్రిల్ నాటికి తన సిబ్బందికి అంతర్గత హెచ్చరికలు జారీ చేసింది. అత్యంత కచ్చితమైన సమయంలో జరుగుతున్న ఈ లావాదేవీలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయనీ, ఇలాంటి అక్రమ లాభార్జనను సహించబోమని అధికారులు హెచ్చరించారు. దీనిపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజీ కమిషన్ (ఎస్ఎస్), సిఎఫ్టిసి వంటి నియంత్రణ సంస్థలు రంగంలోకి దిగి విచారణ జరపాలని అక్కడి చట్టసభ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజలపై పర్యావ'రణం'

# ఇది నేల కోతకు సంకేతం



మానవాళి అభివృద్ధిలో పర్యావరణానిది కీలకపాత్ర. అది ఎంత ఆరోగ్యంగా ఉంటే, మనం కూడా అంత ఆరోగ్యంగా ఉంటాం. మన చుట్టూ ఉన్న జీవ, నిర్జీవ అంశాలన్నింటినీ పర్యావరణం అంటారు. పర్యావరణ ఆరోగ్యం అనేది ప్రజారోగ్యంలోని అతిపెద్ద రంగాలలో ఒకటి. ఒక ప్రాంతంలోని భౌతిక, రసాయన, సాంస్కృతిక వాతావరణం, ఆ ప్రాంత పర్యావరణ ఆరోగ్యాన్ని సూచిస్తుంది. ఇది ఆ ప్రాంతంలోని కాలుష్య స్థాయి, జీవావరణ వైవిధ్యం, పరిశుభ్రమైన తాగునీరు లభ్యత, పారిశుధ్య పరిస్థితులు, వ్యవసాయ ఉత్పాదకత వంటి వాటిపై ఆధారపడి ఉంటుంది. పర్యావరణ సమస్యల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 1.6 కోట్లకు పైగా మరణాలు సంభవిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదించింది. అంతేకాక, వందకు పైగా అనారోగ్యాలు పర్యావరణ ఆరోగ్య సమస్యలతో నేరుగా ముడిపడి ఉన్నాయని కూడా ఆ నివేదిక పేర్కొంది. 155 దేశాలు తమ పౌరులకు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించే హక్కును కల్పించినప్పటికీ, భూమి, గాలి, నీరు, రసాయన కాలుష్యం వంటి "పర్యావరణ ప్రమాదాల" వల్ల 23 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. పర్యావరణ మార్పులు ప్రజల జీవనోపాధికి, ఆహార భద్రతకు ముప్పు తెస్తున్నాయి. ప్రపంచంలోని అతిపెద్ద పర్యావరణ సమస్యలలో వాయు కాలుష్యం ఒకటి. దీని కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 42 లక్షల నుంచి 70 లక్షల మంది మరణిస్తున్నట్టు అంచనా. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ప్రతి పది మందిలో తొమ్మిది మంది అధిక కాలుష్య కారకాలను కలిగి ఉన్న గాలిని పీల్చుకుంటున్నారు. నేడు ఢిల్లీ పరిస్థితి చూశాం. ప్రజలు ఇంట్లో కూడా మాస్కుతోనే జీవిస్తున్నారు. వీరిని కాపాడుకోవాల్సిన బాధ్యత పాలకులదే కదా. మరో ముఖ్యమైన సమస్య ఏమిటంటే, భూమిపై సముద్ర మట్టం సంవత్సరానికి సగటున 3.2 మి.మీ పెరుగుతోంది. ఈ శతాబ్దం చివరి నాటికి అది దాదాపు 0.7 మీటర్ల వరకు పెరిగే అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పెరుగుదల వల్ల సముద్ర తీర ప్రాంతాలు ముంపునకు గురై, సుమారు 34 కోట్ల నుంచి 48 కోట్ల మంది సురక్షిత ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుంది. ప్రతి గంటకు 300 ఫుట్బాల్ మైదానాల పరిమాణంలో అడవులు నరికివేయబడుతున్నాయి. ఇలాగే కొనసాగితే, 2030 నాటికి ఇప్పుడున్న అడవులలో కేవలం పదిశాతం మాత్రమే మిగిలి ఉండవచ్చు. మహాసముద్రాలు భూమి వాతావరణంలోకి విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్లో 30శాతం గ్రహిస్తాయి. అధిక కార్బన్ డయాక్సైడ్ వల్ల సముద్ర జలాలు ఆమ్లీకరణకు గురవుతున్నాయి. దీనివల్ల 2050 నాటికి పగడపు దిబ్బలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యకరమైన నేలలో కనీసం 3 నుంచి 6శాతం సేంద్రీయ పదార్థం ఉంటుంది. కానీ ప్రపంచంలో చాలా చోట్ల ఇది ఉండాల్సిన దాని కంటే చాలా తక్కువగా ఉంది. ఇది నేల కోతకు సంకేతం. మన దేశంలో పర్యావరణ పనితీరును మెరుగుపరచడానికి ప్రభుత్వానికి, పరిశ్రమలు, ప్రజలు కలిసి కృషి చేయాలి. ఈ పని కోసం అనేక కోణాల నుండి ప్రయత్నాలు అవసరం. పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వం కొత్త నియమాలను రూపొందించాలి. ప్రస్తుతం ఉన్న చట్టాలను కచ్చితంగా అమలు చేయాలి. గాలి, నీటి కాలుష్యం, వ్యర్థ పదార్థాల నిర్వహణ, జీవవైవిధ్యం వంటి విషయాలకు సంబంధించిన నియమాలను మరింత పటిష్టం చేయాలి. పర్యావరణ పనితీరు సూచిక వంటి సంస్థల నుండి లభించిన డేటాను ఉపయోగించుకుని కాలుష్యానికి సంబంధించిన బలహీనమైన ప్రాంతాలను గుర్తించి, వాటికి తగిన పరిష్కారాలను కనుగొనాలి. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి పునరుత్పాదక ఇంధన వనరుల వాడకాన్ని వేగవంతం చేయాలి. బొగ్గు వంటి ఇంధనాల వాడకాన్ని దశలవారీగా తగ్గించి, దాని స్థానంలో కాలుష్య రహిత సాంకేతికతను ప్రోత్సహించాలి. గాలి నాణ్యతను మెరుగుపరచడానికి 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. దీనిలో పారిశ్రామిక ఉద్గారాలను నియంత్రించడం, ప్రజా రవాణా, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం, వ్యవసాయ వ్యర్థాలను కాల్చడాన్ని నివారించడం వంటి చర్యలు ఉంటాయి. మురుగునీటి శుద్ధి ప్లాంట్లను నిర్మించడం, వ్యవసాయంలో రసాయనాల వాడకాన్ని తగ్గించడం, చెరువులు, నదుల వంటి నీటి వనరులను కాపాడటం కూడా అవసరం. స్థానిక ప్రజలను పర్యావరణ పరిరక్షణలో భాగం చేయడం ద్వారా, ఈ ప్రయత్నాలు మరింత విజయవంతమవుతాయి.

## మారుతున్న మైండ్సెట్..

# ఏఐ స్కిల్స్పై ఇంజినీర్ల ఫోకస్

**దేశంలో ప్రతి 10 మందిలో 8 మందిది ఇదే ధోరణి**

**షార్ట్ టర్మ్ కోచింగ్ వైపు 66 శాతం మంది ఆసక్తి**

**'ఎడ్టెక్ ఫర్మ్ గ్రేట్ లెర్నింగ్' అధ్యయనంలో వెల్లడి**

హైదరాబాద్,: ఐటీ ఉద్యోగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) తెచ్చిన గుణాత్మక మార్పులకు అనుగుణంగా ఇంజినీర్ల మైండ్సెట్ మారుతున్నది. దీంతో ఏఐ స్కిల్స్ నేర్చుకోవడంపై ఫోకస్ చేసినట్టు తాజా అధ్యయనం వెల్లడించింది. దేశంలో 67% మంది ఇంజినీర్లు ఏఐ స్కిల్స్ నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తాజా సర్వే పేర్కొన్నది. 'ఎడ్టెక్ ఫర్మ్ గ్రేట్ లెర్నింగ్' తాజా అధ్యయనం వివరాలు వెల్లడించింది. ప్రతి 10 మంది ఇంజినీర్లలో 8 మంది ఏఐ స్కిల్స్ నేర్చుకోవడంపై దృష్టి సారించినట్టు పేర్కొన్నది. 'ఇంజినీర్స్ డే'ను పురస్కరించుకుని ఈ రిపోర్టును సదరు సంస్థ రిలీజ్ చేసింది. టెక్నాలజీలో వేగంగా చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా కెరీర్ను తీర్చుదిద్దుకునేందుకు యువత మొగ్గు చూపుతున్నట్టు రిపోర్టు స్పష్టంచేసింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ సర్వేలో 85% మంది ఇంజినీర్లు 2026 నాటికి ఏఐ స్కిల్స్ నేర్చుకోవాలని ప్లాన్ చేసుకుంటున్నట్టు పేర్కొన్నది. ఇంజినీర్లు ప్రస్తుతం నేర్చుకోవాలనుకుంటున్న టాప్ లిస్టులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మిషన్ లెర్నింగ్(ఎంఎల్) మొదటి స్థానంలో ఉన్నట్టు రిపోర్టు తెలిపింది. ఇందులో జనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ, పైథాన్ ప్రోగ్రామింగ్, నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్(ఎన్ఎల్పీ)కు డిమాండ్ ఉండగా.. వీటిలో నైపుణ్యం సాధించే ఇంజినీర్లు కసరత్తు చేస్తున్నట్టు అధ్యయనం పేర్కొన్నది. ఏఐ స్కిల్స్ ఉంటే ఉజ్వల భవిష్యత్తు: స్కిల్స్ పెంపొందిం చుకోవడం ద్వారా కెరీర్లో ఎదుగుదల(45%), ఆర్థికాభివృద్ధి(20%), ప్రమోషన్లు(12%) కొత్త ఉద్యోగ అవకాశాలు(12%) చోటు చేసుకుంటున్నట్టు అధ్యయనం వెల్లడించింది. నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా స్కిల్స్లో వెనకబాటు(11%) తగ్గుతున్నట్టు తెలిపింది. అయితే స్కిల్స్ పెంపొందించుకునేందుకు 66% మంది ఇంజినీర్లు షార్ట్ టర్మ్ కోచింగ్ వైపు ఆసక్తి చూపుతున్నట్టు తెలిపింది. కేవలం 5% మంది ఏడాదికిపైగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందుతున్నట్టు అధ్యయనం వెల్లడించింది. అనేక మంది ఇంజినీర్లు మన దేశంతోపాటు అంతర్జాతీయ యూనివర్సిటీల నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందేందుకు ఆసక్తి కనబరస్తున్నట్టు తెలిపింది. ఈ మార్పు ఐటీ రంగంలో స్కిల్స్కు ఉన్న ప్రాముఖ్యతను స్పష్టం చేస్తున్నది. ఇక ఏఐతో వచ్చిన మార్పులతో దేశంలో 85% మంది ఇంజినీర్లు ఈ ఏడాది ఉద్యోగాలు మారినట్టు అధ్యయనం వెల్లడించింది. ఇందులో 33% మంది వర్క్లైఫ్ను బ్యాలెన్స్ చేసేందుకు జాబ్ మారగా, ఉద్యోగ భద్రత కోసం 18% మంది, కెరీర్లో వెనకబడొద్దని మరో 14% మంది ఉద్యోగం మారినట్టు పేర్కొన్నది. అయితే కేవలం డిగ్రీలు, కోర్సుల సర్టిఫికెట్ల ఆధారంగా కాకుండా.. ఏఐపై ఎవరు పట్టు సాధిస్తారో వారికే ఉద్యోగ అవకాశాలు మరింత ఎక్కువగా ఉంటాయని, వారికే తొందరగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని ఐటీ రంగ నిపుణులు చెబుతున్నారు. ఏఐ టెక్నాలజీని నేర్చుకున్న వారికి భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు ఉంటాయని వారంటున్నారు.

# సార్వజనిక్ గణేష్ మండలి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

## -పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు-జెండా ఊపి రథయాత్ర ను ప్రారంభించిన సార్వజనిక్ గణేష్ మండలి అధ్యక్షుడు బంటు గణేష్



నిజామాబాద్, సెప్టెంబర్ 25 ( ప్రజా గళం ప్రతినిధి )వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు, సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, పుర ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాసన మండలి సభ్యుడు బి.మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ కూరగాయల ఉమారాణి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 2.00 గంటల సమయంలో దుబ్బ ప్రాంతంలోని సార్వజనిక్ గణేష్ మండలి వద్దకు ప్రజాప్రతినిధులు, అధికారులు చేరుకుని, వినాయక నిమజ్జన శోభాయాత్ర రథం వద్ద టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు వీరికి స్వాగతం పలికారు. ఇదే కూడలి వద్ద గల బాలగంగాధర్ తిలక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సార్వజనిక్ గణేష్ మండలి అధ్యక్షుడు బంటు గణేష్ జెండా ఊపి శోభాయాత్ర రథాన్ని ప్రారంభించారు. అందంగా అలంకరించిన సార్వజనిక్ గణేష్ మండలి శోభాయాత్ర రథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గణేష్ నిమజ్జనోత్సవాన్ని ఆనందోత్సాహాల నడుమ, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భుజంగరావు కోరారు. శోభాయాత్రకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం తరఫున అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. వినాయక విగ్రహాలను విసర్జనం చేసే యంచ, ఉమ్మెడతో పాటు అన్ని మండల కేంద్రాలలో అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. నిమజ్జోనోత్సవం సాఫీగా సాగేలా పర్యవేక్షించేందుకు సెక్టోరల్ అధికారులను నియమించామని తెలిపారు. నిమజ్జన ప్రదేశాల వద్ద ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, సరిపడా సంఖ్యలో క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. అన్ని శాఖలు పరస్పరం సమన్వయంతో పని చేస్తున్నాయని, బారికేడ్లు, విద్యుత్ దీపాలు వంటి వసతులు నెలకొల్పామన్నారు. కాగా, శోభాయాత్ర సందర్భంగా సుమారు రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భక్తులకు మంచినీటి సౌకర్యం





నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 25 ( ప్రజాగళం ) గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా భక్తులకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడలి గాంధీ చౌక్ లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లమారి సుధాకర్ అధ్యక్షతన నీటి సరఫరా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గణేష్ నిమజ్జన రథయాత్రలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు అత్యంత భక్తిశ్రద్ధలతో నీటి వసతిని కల్పించడం జరిగిందని సుధాకర్ వెల్లడించారు. గణేష్ మండలి భక్తులు తమ దాహార్తిని తీర్చుకునేందుకు నిజామాబాద్ నగర సెంటర్ లోని గాంధీ చౌక్ లో మంచినీటి సౌకర్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తులు భారీగా తరలివచ్చి తమ అందించిన నీటి పానీయాన్ని సేకరించి ఆనందం వ్యక్తం చేశారని సుధాకర్ స్పష్టం చేశారు. ప్రజాసేవే ధ్యేయంగా ఈ నీటి సౌకర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. ఈ సెంటర్ లో ఎమ్మార్పీఎస్ నాయకులు జీవన్, దేవేందర్, గంగాధర్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో

# నూతన గ్రంథాలయం

### టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



నిజామాబాద్ సెప్టెంబర్ 25 (ప్రజాగళం ప్రతినిధి ) ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా నూతన గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. జిల్లా కేంద్రంలో ఆధునిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న నూతన గ్రంథాలయంకు శుక్రవారం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు, యువతకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయంలో ఆధునిక సౌకర్యాలు, నాణ్యమైన పుస్తకాలు, డిజిటల్ వనరులు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. పుస్తక పఠనం ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో అవసరమని ఆయన అన్నారు. పుస్తకాలు జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు ఆలోచనా విధానాన్ని, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయని తెలిపారు. ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి రావడంతో ప్రపంచం అరచేతిలోకి వచ్చిందని, వీరబ్రహ్మేంద్ర స్వామి చెప్పిన విషయాలు నేటి పరిస్థితుల్లో మరింత ప్రాసంగికంగా కనిపిస్తున్నాయని అన్నారు. సోషల్ మీడియా ప్రభావం యువతపై పెరుగుతున్న నేపథ్యంలో దాని వినియోగంలో విచక్షణ అవసరమని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. సోషల్ మీడియాను కేవలం వినోదానికి పరిమితం చేయకుండా విద్య, విజ్ఞానం, నైపుణ్యాభివృద్ధికి ఉపయోగించుకోవాలని యువతకు సూచించారు. యువతకు గ్రంథాలయాల ప్రాధాన్యతపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా కళాశాల విద్యార్థులు గ్రంథాలయ సభ్యత్వం తీసుకుని పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలకు సంబంధించిన సమాచారాన్ని గ్రంథాలయాల ద్వారా పొందేలా ప్రోత్సహించాలని అన్నారు. నూతన గ్రంథాలయం నిజామాబాద్ పట్టణంలోని విద్యార్థులు, యువతతో పాటు ప్రజలందరికీ విజ్ఞాన కేంద్రంగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఉమారాణి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజారెడ్డి, శేఖర్ గౌడ్, బంటు బలరాం, భక్త వాత్సలశీ నాయుడు నరాల రత్నాకర్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రంథాలయ నిర్వాహకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంత్యోదయ సిద్ధాంతం ఎంతో గొప్పది

## దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ సిటీ సెప్టెంబర్25(ప్రజాగళం)దీన్ దయాళ్ ఉపాధ్యాయ అందించిన అంత్యోదయ సిద్ధాంతం ఎంతో గొప్పదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి పురస్కరించుకొని నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సమాజంలోని చివరి వరుసలో ఉన్న వ్యక్తి అభివృద్ధి చెందే వరకు దేశ అభివృద్ధి పూర్తికాదనే ఆలోచన అంత్యోదయ సిద్ధాంతంలో ఉందన్నారు. భారతీయ ఆలోచనా విధానానికి, దేశసేవకు, సామాజిక సమరసతకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ అన్నారు. రాజకీయాన్ని కేవలం అధికార సాధనంగా కాకుండా సమాజసేవకు ఒక మార్గంగా చూడాలనే భావనతో ఆయన పనిచేశారన్నారు. దీనదయాళ్ ఉపాధ్యాయ దేశానికి అందించిన అత్యంత ముఖ్యమైన ఆలోచనల్లో "ఏకాత్మ మానవవాదం" ఒకటని గుర్తుచేశారు. మనిషి, సమాజం, దేశం, ఇవన్నీ పరస్పరం అనుసంధానమై ఉన్నాయని వివరించారు. దీనదయాళ్ ఉపాధ్యాయ గారి జీవితం మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తుందన్నారు. దేశం కోసం ఆలోచించాలి, సమాజం కోసం పనిచేయాలి, చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, మహిళా మోర్చ అధ్యక్షురాలు వనిత, ఎస్సీ మోర్చ అధ్యక్షులు పురుషోత్తం, కార్పొరేటర్లు శ్రావణ్ కుమార్, స్రవంతి వినోద్ రెడ్డి, ప్రసూన శ్రీనివాస్, వైష్ణవి సుధా, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, సుమిత్ర కిషోర్, మండల అధ్యక్షులు గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

# మానసిక దివ్యాంగ విద్యార్థులకు మేమున్నామంటూ మనోధైర్యం కల్పించాలి

## - స్నేహ సొసైటీలో ఘనంగా పండిత్ దీన్ దయాళ్ జయంతి వేడుకలు- ముఖ్య అతిథిగా హాజరైన నగర మేయర్ కూరగాయల ఉమారాణి




నిజామాబాద్ సిటీ , సెప్టెంబర్ 26(ప్రజాగళం ) అంధ,మానసిక దివ్యాంగ విద్యార్థులకు మేమున్నామంటూ మనోధైర్యం కల్పిస్తూ వారి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేయాలనీ నగర మేయర్ కూరగాయల ఉమారాణి పేర్కొన్నారు. మానసిక, దివ్యాంగ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న స్నేహ సొసైటీ పాఠశాల కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, సిబ్బందిని అభినందించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాల ఆవరణలో పండిత్ దీన్ దయాళ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు... ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర మేయర్ ఉమారాణి, నుడా చైర్మన్ కేశవేణు హాజరై పండిత్ దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ వంతు బాధ్యతగా మానసిక దివ్యాంగ విద్యార్థుల ఉన్నతి కోసం తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు ఎంత మంది దివ్యాంగ విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు వారి ఆరోగ్య పరిస్థితులను ప్రతి విషయాన్ని స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్ సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి క్లుప్తంగా ముఖ్య అతిథులకు,పలు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బందికి వివరించారు. నుడా చైర్మన్ కేశ వేణు మాట్లాడుతూ స్నేహ సొసైటీని 1995 లో నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసి నిర్వహించడం చూశానన్నారు. అయితే నాటి నుండి నేటి వరకు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఎంతోమంది దివ్యాంగ విద్యార్థుల ఉన్నతి కోసం పాటుపడడం స్నేహ సొసైటీ వ్యవస్థాపకులు ఎస్. సిద్ధయ్య, జ్యోతి దంపతులకే దక్కిందన్నా రు. అలాగే అంధ, మానసిక, దివ్యాంగ విద్యార్థుల్లో మానసిక ధైర్యం నింపుతూ మేమున్నామంటూ ఆకున్న చేర్చుకొని వారి భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేస్తు బంగారు బాటాలు వేస్తూ కృషి చేయడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు.. ఇప్పటివరకు ఎంతోమంది దివ్యాంగ విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించి పాఠశాలతో పాటు జిల్లాను గర్వించదగ్గ స్థాయిలో ఉంచారని కొనియాడారు. పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఈ కార్యక్రమానికి రావడం దివ్యాంగ విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు తిలకించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.. దివ్యంగ విద్యార్థులు అయినప్పటికీ కూడా పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గురించి లూయీ బ్రెయిలీ ద్వారా నేర్చుకున్న వారి జీవిత చరిత్రను ఇతర విషయాలను క్లుప్తంగా వివరించడం ఎంతో గొప్ప విషయం అన్నారు... కంటిచూపు లేనప్పటికీ స్పర్శ ద్వారా చదువుతోపాటు సాంస్కృతిక నృత్యాలు, పాటలు , యోగ చేయడం ఎంతో గొప్ప విషయం అని అన్నారు.. ఇంతగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న స్నేహ సొసైటీ నిర్వాహకులు, ఉపాధ్యాయ సిబ్బందిని ప్రతి ఒక్కరిని అభినందించారు... ఈ కార్యక్రమంలో పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సైతం ప్రదర్శనలు నిర్వహించారు..ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులను శాలువాలు, జ్ఞాపికాలతో ఘనంగా సన్మానించారు..ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్ సిద్దయ్య, అందుల ప్రత్యేక పాఠశాల పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గణపతి బొప్పా మోరియా....ఎడపల్లి గ్రామంలో ఉత్సాహంగా భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమైన గణేష్ నిమజ్జన శోభాయాత్ర

## ...శోభాయాత్రలో నృత్యాలు చేస్తూ,ఆనందోత్సాహాల మధ్య పాల్గొన్న యువకులు, పిల్లలు,పెద్దలు....



ఎడపల్లి,సెప్టెంబర్ 25: (ప్రజా గళం)ఎడపల్లి పాత గ్రామంలోని సార్వజనిక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడు శుక్రవారం నిమజ్జనానికి బయలుదేరాడు. 11రోజుల పాటు భక్తి శ్రద్దలతో భక్తులచే ప్రత్యేక పూజలు అందుకున్న గణ పయ్య గంగమ్మ ఒడికి వేళ్లారు. ఈ శోభ యాత్ర రథానికి సర్పంచ్ కందగట్ల రాంచందర్,గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు,సొసైటీ చైర్మన్ పోల మల్కారెడ్డి లు ఉ త్సవ కమిటి సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం శోభాయాత్ర ను జెండా ఊపి ప్రారంభించా రు. మధ్యాహ్నం శోభాయాత్ర ప్రారంభం కాగా,డిజె పాటలతో ఉత్సాహంగా యువకులు,పిల్లలు,పెద్దలు నృత్యాలు చేస్తూ కేరింతలు కొడుతూ గణపతి బొప్పా మోరియా తులసావలసి లౌకరియా అంటూ పెద్ద ఎత్తు న నినాదాలు చేస్తూ శోభాయాత్ర కొనసాగింది. గ్రామంలోని వీరభద్ర గణేష్ మండలి,అంబేద్కర్ గణేష్ మండలి,మున్నూరు కాపు గణేష్ మండలి,శివాలయం గణేష్ మండలి,వీర హనుమాన్ గణేష్ మండలి తది తర గణేష్ మండలిల గణనాధులు నిమజ్జనానికి శోభాయాత్రలో బయలుదేరాయి. ఏకదంతా మంగళ మూర్తి మోరియా అంటూ భక్తులు భక్తితో గణనాథుల ను భక్తితో కొలిచారు. డిజె పాటల చప్పుళ్ల మధ్య ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ శోభాయాత్రలో పాల్గొ న్నారు. అంతకుముందు గణపతి వద్ద 11 రోజుల పాటు నిత్యపూజలు అందుకున్న గణేష్ లడ్డులకు ఉత్సాహ కమిటీ నిర్వాహకులు వేలం పాట నిర్వహిం చగా భక్తులు భక్తి తో వేలం పాటలో పాల్గొని వేల రూపా యలకు వేలంపాడి లడ్డు దక్కించుకున్నారు. ఎటువం టి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆదేశాలమేరకు బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు పర్యవేక్షణలో ఎడపల్లి ఎస్ఐ ముత్యాల రమ పోలీస్ బందోబస్తూ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మంలో గ్రామ పెద్దలు,ఉత్సవ కమిటీ సభ్యులు,గ్రామ స్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో

# గణేష్ శోభాయాత్ర రూట్‌ను పరిశీలన...



బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 25: (ప్రజా గళం)బోధన్ పట్టణంలో నిర్వహించనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రను సజావుగా నిర్వహించేందుకు మున్సిప ల్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధాన రహదారి రూట్ ను పరిశీలించారు. ఏకచక్రేశ్వర శివాలయం నుంచి హెడ్ పోస్టాఫీస్,రెంజల్ బేస్,పాత బోధన్ ప్రాంతాన్ని,శోభా యాత్ర సాగే మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి,అవస రమైన ఏర్పాట్లు,తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారిం చారు. శోభాయాత్ర నిర్వహించే మార్గంలో భక్తులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రూట్ లో అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్‌పర్సన్,ఫ్లోర్ లీడర్ తూము పద్మ శరత్‌రెడ్డి దంపతులు, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ,సార్వజనిక్ ఉత్సవ కమిటీ సభ్యులు రాజుల దేవి,పవన్‌కుమార్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ అంకుదాము, కోఆప్షన్ సభ్యుడు సంగ్రామ్, ప్రముఖులు నక్క లింగారెడ్డి, స్థానిక కౌన్సిలర్లు,ప్రజాప్ర తినిధులు,మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్లుగా రిపేర్ లేని రోడ్డు!

పూణె: మన భారతదేశంలో కొన్ని ప్రయాణాలు చేసేటప్పుడు గతుకుల రోడ్లు.. డ్యామేజ్ అయినా రహదారులు కనిపిస్తూ ఉంటాయి. అయితే కొత్తగా వేసిన రోడ్డు సైతం కొన్ని రోజుల తర్వాత వెంటనే గుంతలు పడడం లేదా డ్యామేజ్ అవ్వడం జరుగుతుంది. కానీ పూణే లోని ఓ రోడ్డు 48 సంవత్సరాల కిందట వేయగా.. ఇప్పటి వరకు ఆ రోడ్డు చెక్కుచెదరకుండా ఉంది. అంతేకాకుండా 2.5 కిలోమీటర్ల వరకు ఒక్క గుంత కూడా కనిపించదు. అసలు విషయం ఏంటంటే ఈ రోడ్డు నిర్మించే ముందే కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి ఒక సవాలు విసిరారు. 10 సంవత్సరాల వరకు ఈరోడ్డుపై ఒక్క గుంతఉన్న కూడా తిరిగి రోడ్డు మొత్తం వేస్తామని అన్నారు.. కానీ48 సంవత్సరాల వరకు ఆ రోడ్డు నాణ్యతతో ఉంది. ఇంతకీ ఆరోడ్డు పూణేలో ఎక్కడ ఉంది? దీనిని నిర్మించింది ఎవరు? ఆ తర్వాత వీరికి జరిగిన నష్టం ఏంటిపూణేలోని జంగ్లీ మహారాజ్ రోడ్..దీనినే ప్రస్తుతం ఏఓరోడ్డు అని పిలుస్తున్నారు. శివాజీ నగర్ నుంచి దక్కన్ జింఖానా వరకు 2.5 కిలోమీటర్ల వరకు 6రోడ్డు కనిపిస్తుంది. దీనిని 1976 జనవరి లో ప్రారంభించారు. 1972లో మహారాష్ట్రలో కరువు, మరదల కార ణంగా పూణేలోని చాలా ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసం అయ్యాయి. ఆ సమయంలో కొందరు రాజకీయ నాయకులుమాట్లాడుతూ ముంబైలోని రోడ్లు ఎన్నో వరదలు వచ్చినా కూడా తట్టుకొని ఎందుకు ఉంటు న్నాయి? అన్న ప్రశ్నలు లేవనెత్తారు. దీంతో ముంబైకి చెందిన రెకాండో అనే సంస్థ హార్ట్ మిక్స్ హాట్ ఎతిలీ అనే టెక్నాలజీతో రోడ్లను నిర్మిస్తుందని కొందరు చెప్పారు. ఈ రికనీడో సంస్థను పార్శి సోదరులు నడిపేవారు. ఈ విషయం తెలుసుకున్న పూణేలోని కార్పొరేటర్ శ్రీకాంత్ శిలోరే పట్టుదలతో పార్శ బ్రదర్స్ కు శివాజీ నగర్ రోడ్డు కాంటాక్ట్ గా అప్పగించారు. అయితే వారు కాంటాక్ట్ లో పేర్కొన్న ప్రకారం.. 10 సంవత్సరాల వరకు రోడ్డు నాణ్యత దెబ్బతింటే తిరిగి పూర్తిగా నిర్మిస్తామని సవాల్ విసిరారు. వీరుఈరోడ్డు నిర్మించే సమయంలో నాణ్యతను ఉపయోగించిహాట్ ఎతిలీ టెక్నాలజీని ఉపయోగించారు. భవిష్యత్తులో కేబుల్స్,తుఫాను వంటి నీటి కాలువల కోసం రోడ్డు అంచున ప్రత్యేకంగా డక్టులను ఏర్పాటు చేశారు.ఈ విధంగా వారు వేసిన రోడ్డు 48 సంవత్సరాల వరకు నాణ్యతతో కూడుకొని ఉంది. ఇప్పటివరకు ఈరోడ్డుపై ఎక్కడ గుంత ఏర్పడలేదు. 2010లో స్వల్ప మరమ్మతులు మినహా రోడ్డుకు నిర్వహణ ఖర్చులు ఎక్కడ అవసరం పడలేదు. అయితే దురదృష్టం ఏంటంటే ఈ ప్రాజెక్టు పూర్తి అయిన తర్వాత రికండో కంపెనీకి మళ్లీ కొత్త ప్రాజెక్టు రాలేదు. పార్శ బ్రదర్స్ వయసు ఎక్కువగా కారణంగా వారు మరో ప్రాజెక్టు చేపట్టలేదు అన్న ప్రచారం ఉంది. ఇటీవల వేసిన చాలా రోడ్లు, బ్రిడ్జిలు ఏడాది తిరగకముందే నాణ్యతను దెబ్బతింటున్నాయి. అలాంటి వారికి ఈ ఏఓ రోడ్డు స్ఫూర్తిదాయకమని చెప్పవచ్చు.

# మరో కొత్త ఆర్వోబీ..!

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణం వేగం పుంజుకుంది. కేంద్ర ప్రభుత్వం సహకారంతో పలు జాతీయ రహదారుల నిర్మాణాలు, రైల్వే ప్రాజెక్టులు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే మరో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం నుంచి ఆమోదం లభించింది. విజయవాడ వాంబేకాలనీ వాసుల చిరకాల కోరికను నెరవేరుస్తూ వాంబే కాలనీ- మధురానగర్ మధ్యన రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వాంబే కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు మౌలిక వసతుల ప్రాజెక్టులకు మోక్షం కలుగుతున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సహకారంతో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పలు ప్రాజెక్టులలో కదలిక వస్తోంది. ఈ క్రమంలోనే విజయవాడ ఈ కాలనీలో నివసించేపేదలు, కూలీల కల ఎట్టకేలకు నెరవేరనుంది. మధురానగర్ - వాంబేకాలనీ మధ్య లిమిటెడ్ హైట్ సబ్ వే (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో త్వరలోనే లిమిటెడ్ హైట్ సబ్ వే నిర్మాణానికి సంబంధించి అడుగులు పడనున్నా యి.అజిత్ సింగ్ నగర్, వాంబేకాలనీలలో నివసించే కూలీలు, నిరుపేదలు పనుల కోసం విజయవాడ నగరంలోకి రావాలంటే అవస్థ లు పడాల్సి వస్తోంది. సుమారు 50 వేల మంది కూలీలు, కార్మికులు విజయవాడలోకి రావాలంటే వాంబేకాలనీ- దేవీనగర్ మధ్య ఉన్న రైల్వేట్రాక్‌నుదాటాల్సి వస్తోంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నిత్యం ఈ రైల్వేట్రాక్ దాటుతూ రాకపోకలు సాగిస్తున్నారు. విజయవాడ- విశాఖ రైల్వేలైన్ దాటి దేవీనగర్, మధురానగర్ మీదుగా నిత్యం ఎంతోమంది రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ట్రాక్ సుమారుగా పది అడుగుల ఎత్తు ఉండటంతో మహిళలు, చిన్నారులు చాలా ఇబ్బందు లు పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పలుసార్లు ప్రమాదాలు కూడా జరిగాయి.దీంతో ఈసమస్యను పరిష్కరించాలని, రైల్వే అండర్ బ్రిడ్జిని నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎంపీ కేశినేని చిన్ని ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ ఈ అంశం మీద రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ కూడా రాశారు. ఈ లేఖపై స్పందించిన రైల్వే మంత్రి.. వాంబే కాలనీ- మధురానగర్ మధ్య లిమిటెడ్ హైట్ సబ్ వే నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఈ మేరకు విజయవాడ ఎంపీ కేశినేని చిన్నికి లేఖ ద్వారా సమాచారం అందించారు.లిమిటెడ్ హైట్ సబ్ వే ( రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణానికి సంబంధించిన డిజైన్, డ్రాయింగ్ పనులు ప్రారంభించామని.. లేఖలో వివరించారుఈ నిర్మాణం పూర్తి అయితే అజిత్ సింగ్ నగర్ ఫ్లైఓవర్ మీద భారం తగ్గుతుంది. అలాగే వేలాది మందికి ప్రయోజనం చేకూరనుంది. మరోవైపు చిరకాల స్వప్నమైన రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో వాంబే కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.


# బార్ల వైపు చూడని జనం..!




గుంటూరు, : ఆంధ్రప్రదేశ్ లో కొత్త బార్ల పాలసీకి స్పందన కొరవడింది. ఆశించిన రీతిలో దరఖాస్తులు అందకపోవడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. లైసెన్సు ఫీజు భారీగా తగ్గించినప్పటికీ దరఖాస్తుదారులు ముందుకు రాకపోవడానికి కారణాలపై ఎక్సైజ్ అధికారులు ఆరా తీస్తున్నారు. నిజానికి ఏపీలో బార్ల లైసెన్స్ ల కోసం ఎప్పుడూ ఎగబడతారు. బార్లకు సమయం కూడా ప్రభుత్వం పెంచడంతో గిరాకీ పెరిగే అవకాశముంది. అత్యధిక లాభాలను ఆర్జించే అవకాశాలున్నాయి. అయినా సరే ఎందుకో గాని ఈసారి బార్ల లైసెన్సుల కోసం దరఖాస్తులు అతి తక్కువ రావడంతో దీనిపై ఎక్సైజ్ అధికారులు కింది స్థాయి అధికారులతో మాట్లాడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 840బార్లకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈరో జుతో దరఖాస్తు గడువు ముగియనుంది. అయితే ఇప్పటి వరకూ వచ్చిన దరఖాస్తులు కేవలం తొంభయి మాత్రమేనని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఇంత తక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ వేయడం కూడా కష్టమేనని ఎక్సైజ్ శాఖ అధికా రులు భావిస్తున్నారు. మద్యం వ్యాపారులు ఎక్కువ మంది ఉత్సాహం చూపడానికి గల కారణాలను అన్వేషించడంలో ఎక్సైజ్ శాఖ అధికారులు ఉన్నారు. నిజంగా ఇది ఆశ్చర్యానికి గురి చేస్తుందంటున్నారు. దీనికి ప్రధాన కారణం అధికార పార్టీ ఎమ్మెల్యేల వత్తిడి కూడా కొంత ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. అదే సమయంలో ఎనిమిది జిల్లాల్లో ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు ఆందోళనలో ఉన్నారు. అనంతపురం, కోనసీమ, అనకాపల్లి, తూర్పు గోదావరి, నెల్లూరు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. గుంటూరు, ప్రకాశం,విజయవాడ వంటి ప్రాంతాల్లోనూ తక్కువ దరఖాస్తులు వచ్చాయంటున్నారు. అయితే బెల్ట్ షాపులు పెరిగిపోవడంతో పాటు వైన్ షాపులనే మినీ బార్లుగా మలచి వ్యాపారాలను నిర్వహిస్తుండటంతో తాము బార్లకు లైసెన్సు ఫీజు చెల్లించి అనుమతులు పొందినా గిరాకీ రావడం కష్టమేనని భావించి వెనక్కు తగ్గి ఉంటారని అనుమానిస్తున్నారు. మరొకవైపు వ్యాపారులు సిండికేట్ అయ్యారన్న సందేహాలు కూడా ఉన్నాయి.ఎక్సైజ్ శాఖ తీసుకువచ్చిన కొత్త విధానం తమకు అనుకూలంగా లేదనీ.. దానివల్ల తమకు గిట్టుబాటు కాదని వ్యాపారులు ఆసక్తి చూపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతీ బార్‌కు కనీసం 4దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామనే రూల్ పెట్టడం తో.. అదనపు ఏఆర్ఈటీ 15 శాతాన్ని తొలగించకపోవడం కూడా వ్యాపారులు లైసెన్స్‌లకు అప్లై చేసుకోకపోవడానికి ఒక కారణంగా భావిస్తున్నారు. మరోవైపు.. ఇప్పటికే ఏపీలో మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసుకునేం దుకు ఇటీవలె ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అంతేకాకుండా రూ.99కిదొరికే క్వార్టర్ మద్యాన్ని బార్‌లలో అమ్మడానికి వీలులేదనే నిబంధన కూడా తీసుకువచ్చింది.ఎన్టీఆర్ జిల్లాలో130 బార్‌లు ఉండగా.. కేవలం 10 బార్‌లకే దరఖాస్తులు వచ్చాయి. గుం టూరు జిల్లాలో 110కి గానూ బార్‌లకు మాత్రమే 4 లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. కర్నూలు జిల్లాలో 2బార్‌లకు 6 బార్లకు మాత్రమే 4 లేదా అంతకుమించి అప్లికేషన్లు వచ్చాయి.మొత్తం 3,332 మంది రూ. 10వేలు ప్రాసెసి ంగ్‌ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారనీ..వారంతా అప్లికేషన్ చేసుకు న్నారని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నెల 30వ తేదీన ఉదయం 8 గంటల నుంచి లాటరీ తీసే ప్రక్రియ మొదలు అవుతుందని ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిషాంత్ కుమార్ వెల్లడించారు.

# ఏఐతో ఉద్యోగాల తొలగింపు..

## సీనియర్లను పక్కనపెట్టి జూనియర్లతో పని.. వైరల్ అవుతున్న రెడిట్ పోస్ట్!




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వల్ల ఉద్యోగాలు పోతాయనే భయాలు నిజమవుతున్నాయి. ఖర్చులు తగ్గించుకునేందుకు, లాభాలు పెంచుకునేందుకు కంపెనీలు ఏఐని వేగంగా అందిపుచ్చుకుంటున్నాయి.ఈ క్రమంలో ఉద్యోగుల తొలగింపు పర్వం ఇప్పటికే మొదలైందని చాటిచెబుతున్న ఓ రెడిట్ పోస్ట్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది. 'ఇండియన్ వర్క్‌ప్లేస్' అనే రెడిట్ గ్రూపులో "ఏఐరీప్లేస్‌మెంట్ ఈజ్ రియల్" (ఏఐతో తొలగింపు నిజం) అనే పేరుతో ఓయూజర్ పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. తన కంపెనీలో సీనియర్,మధ్యస్థాయి ఉద్యోగులను తొలగించి,వారి స్థానంలో కేవలంఅనుభవం లేని అసోసియేట్లు, ఇంటర్న్‌లను మాత్రమే ని యమించుకోవాలని తమ సీఈఓ భావిస్తున్నారని ఆ యూజర్ పేర్కొన్నారు. ఇందుకోసం ఏకంగా 15 నుంచి 20 ఏఐ టూల్స్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కంపెనీ అభివృద్ధి చేసిన ఏఐ టూల్‌ను వాడటం లేదనే కారణంతో, అవార్డులు గెలుచుకున్న ఓ టాప్ పెర్ఫార్మర్‌పై సీఈఓ దాదాపు రెండు గంటల పాటు ఒత్తిడి చేశారని ఆ పోస్టులో వెల్లడించారు. ఇప్పటికే కంపెనీలోని చాలా మందిటీమ్ లీడ్స్,ఆర్కిటెక్టులను తొలగించారని, ఇక అంతా ముగి సిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పోస్ట్ వైరల్ కావడంతో, నెటిజన్లు భిన్నరకాలుగా స్పందిస్తున్నారు. ఏఐ మోజులో పడి కంపెనీలు ఉద్యోగులను తొలగించడం సరైన పద్ధతి కాదని, ఇది భవిష్యత్తులో తిప్పికొడుతుందని పలువురు హెచ్చరిస్తున్నారు. "ఏఐ రాసిన కోడ్‌ను అర్థం చేసుకోవడానికి, దాన్ని సరిచేయడానికి మళ్లీ నిపుణులైన టెకీలు అవసరమవుతారు" అని ఒకరు కామెంట్ చేయ గా, "కొన్నేళ్ల తర్వాత జూనియర్లు, ఏఐ కలిసి సృష్టించిన అయోమ యాన్నిసరిచేయడానికి మళ్లీ సీనియర్లనే నియమించుకోవాల్సి వస్తుం ది" అని మరొకరు అభిప్రాయపడ్డారు. మంచి డ్రైవర్ లేకపోతే రేసు కారుతో పరుగుపందెం గెలవలేమని, అలాగే నిపుణుడైన డెవలపర్ లేకుండా ఏఐతో గొప్ప ఉత్పత్తులను సృష్టించడం అసాధ్యమని ఇంకొందరు పేర్కొన్నారు.కాగా, గత వారం అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ కూడా ప్రస్తుత ఏఐ క్రేజ్‌ను ఒక 'పారిశ్రామిక బబుల్' (పారిశ్రామిక బుడగ)గా అభివర్ణించడం గమనార్హం.

# అందరూ మిత్రులే...

విజయవాడ: ఏ రాష్ట్రంలోనైనా ప్రాంతీయ పార్టీలు ప్రత్యర్థులుగా ఉంటూ కేంద్రంలో ఉన్న ప్రభుత్వాన్ని ఒకరు మద్దతిస్తే, మరొకరు వ్యతిరేకిస్తారు. కానీ ఏపీ రాజకీయాల తీరు వేరు. 2014 లో రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి ఇక్కడ ప్రధాన ప్రాంతీయ పార్టీలైన తెలుగుదేశం, వైసీపీలు కేంద్రంలో ఉండే బీజేపీ వైపు నిలుస్తున్నాయి. 2014 ఎన్నికల్లో టీడీపీనేరుగా బీజేపీతో పొత్తు పెట్టుకుని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అదే సమయంలో ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ కూడా కేంద్రంలో ఉన్నబీజేపీకి అనేక సందర్భాల్లో మద్దతుగా నిలిచింది. ఇక నాడు ప్రారంభమయిన దోస్తీనేటి వరకూ కొనసాగుతూనే ఉంది. 2014లో కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన టీడీపీ, బీజేపీలు తర్వాత విభేదాలతో విడిపోయాయి. ఎన్డీఏ నుంచి టీడీపీ బయటకు వచ్చేసింది. 2019ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో నాడు బీజేపీని వ్యతిరేకించిన చంద్రబాబు దాదాపు ఐదేళ్లు ఢిల్లీకి వెళ్లలేదు. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ పట్ల టీడీపీ సాఫ్ట్ కార్నర్ గావ్యవరిస్తూ వచ్చింది. అంతేకాదు టీడీపీకి చెందిన రాజ్యసభ సభ్యులు నలుగురు బీజేపీలోకి వెళ్లిపోయారు. ఇక అప్పటి నుంచి నాడు అధికారంలో ఉన్న వైసీపీ, ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి మద్దతిస్తూ వస్తుంది. 2018 లో జరిగిన ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న టీడీపీ చివరకు 2019 లో ఫలితాల తర్వాత మాత్రం తిరిగి బీజేపీకి దగ్గరయ్యే ప్రయత్నం చేసింది.

# మార్కెట్‌కు హెచ్-1బీ సెగ!

## ఐటీ, స్థిరాస్తి రంగాల్లో అమ్మకాల ఒత్తిడి!




ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్లను హెచ్-1బీ వీసాల ఫీజు పెంపు నిర్ణయం గట్టిగానే ప్రభావితం చేయవచ్చునిపిస్తున్నది. ముఖ్యంగా భారతీయ ఐటీ రంగ సంస్థల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కోవచ్చని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో లాభాల స్వీకరణకు ఆస్కారం ఉందనే చెప్పవచ్చు. నిజానికి సూచీల అప్‌ట్రెండ్‌కు గతవారం చివరి రోజునే బ్రేకులుపడ్డాయి. మదుపరులు అమ్మకాలకే పెద్దపీట వేశారు. అయినప్పటికీ అంతకు ముందు వారం ముగింపుతో చూస్తే గత వారంలోనూ సూచీలు పుంజుకున్నాయి. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 721.53 పాయింట్లు పెరిగి 82,626.23 వద్ద ముగిసి ంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 213.05 పాయింట్లు కోలుకుని 25,327.05 దగ్గర నిలిచింది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వీసాల నిర్ణయంతో ఈ వారం మార్కెట్లపై సెల్లింగ్ ప్రెషర్ ఉండవచ్చన్న అంచనాలైతే వినిపిస్తున్నాయి. ఇక ఎప్పట్లాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జా తీయ పరిణామాలు ముఖ్యమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 25,000 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,800 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,600-25,800 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

# బొండాకు ఫ్రస్టేషన్ ఎందుకు

విజయవాడ, : టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు జనసేన అంటే పడటం లేదా ఆయన అసెంబ్లీ సమావేశాల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేయడాన్ని అనేక కోణాల్లో విశ్లేషణలు వెలువడుతున్నాయి. బొండా ఉమామహేశ్వరరావు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి రెండో సారి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఆయన ఈసారి మంత్రి పదవిని ఆశించారు. కానీ జనసేనతో పాటు టీడీపీలో ఉన్న కాపు సామాజికవర్గం నేతలకు ఎక్కువ మంత్రి పదవులు ఇవ్వాల్సి రావడంతో బొండా ఉమామహేశ్వరరావుకు తాను ఆశించినట్లు మంత్రి పదవి దక్కలేదు. భవిష్యత్ లోనూ దక్కుతుందన్న గ్యారంటీ మాత్రం కనిపించడం లేదు సామాజికవర్గం.. జిల్లా కోటాలో... ఎందుకంటే బొండా ఉమామహేశ్వరరావు కాపు సామాజికవర్గం కావడంతో పాటు కృష్ణా జిల్లా కావడంతో జిల్లా కోటాలో, సామాజికవర్గం కోటాలో ఆయనకు మంత్రి పదవి దక్కే అవకాశాలు భవిష్యత్ లో లేవన్నది అంచనా. ఎందుకంటే పొంగూరు నారాయణకు ఖచ్చితంగా కేబినెట్ లో కీలకంగా ఉంటారు. అదే సమయంలో కృష్ణా జిల్లా నుంచి ఇతర సామాజికవర్గానికి చెందిన నేతలకు మాత్రమే మంత్రి పదవి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే జనసేన వల్లనే తనకు మంత్రి పదవి దక్కలేదన్న అక్కసు ఆయనలో స్పష్టంగా కనిపిస్తుంది. టీడీపీలో ఒక సంప్రదాయం ఉంది. ఏ సామాజికవర్గం వారిని ఆ సామాజికవర్గం వారి చేతనే విమర్శలు చేయిస్తారు. అలాడే టీడీపీ అధినాయకత్వం ఆదేశాల మేరకు అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారా లేక ఆయన సొంతంగా తీసుకున్న నిర్ణయమా అన్నది తేలాల్సి ఉంది. కాలుష్య నియంత్రణ మండలి విభాగానని కూడా చూస్తున్న పవన్ కల్యాణ్ ను నేరుగా విమర్శించకపోయినా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిత్వ శాఖపై విమర్శలు చేయడంతో జనసైనికులు మండిపడుతున్నారు. గతంలో అంటే 2019 లో కాపు సామాజికవర్గం టీడీపీ నేతగా బొండా ఉమామహేశ్వరరావు పవన్ కల్యాణ్ పై చేసిన విమర్శలను ఈ సందర్భంగా జనసైనికులు గుర్తు చేస్తున్నారు. అయితే దీనిపై పవన్ కల్యాణ్ కూడా ఒకింత సీరియస్ గానే ఉన్నట్లు కనపడుతుంది. ఈ విషయంలో ఆయన పర్యావరణ శాఖ అధికారుల నుంచి పూర్తి వివరాలను ఇప్పటికే తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దీనిపై ఒక రిపోర్టు ఇవ్వడానికి ఆయన సిద్ధమవుతున్నట్లు కనపడుతున్నారని అంటున్నారు. . బొండా ఉమామహేశ్వరరావు తన నియోజకవర్గం పరిధిలో ఒక కంపెనీపై కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేయడమే కాకుండా, న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారని చెబుతున్నారు. నియంత్రణ మండలిని బొండా ఉమామహేశ్వరరావు కోరారంటున్నారు. వెంటనే అధికారులు ఆ కంపెనీకి నోటీసులు ఇవ్వడమే కాకుండా చర్యలకు కూడా సిద్ధమవుతున్న సమయంలో తిరిగి ఫిర్యాదు చేసిన బొండా ఉమామహేశ్వరరావు చర్యలు తీసుకోవద్దని కోరినట్లు పవన్ కల్యాణ్ కు ఇచ్చిన నివేదికలో అధికారులు తెలిపినట్లు సమాచారం. అంటే ఇక్కడ ఏదో జరిగిందని పవన్ కల్యాణ్ కూడా అనుమానిస్తూ దీనిపై చంద్రబాబు వద్ద పంచాయతీ పెట్టాలని నిర్ణయించుకున్నారని సమాచారం.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కష్టాలు

హైదరాబాద్,: తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలకు సుప్రీం కోర్టు విధించిన గడువు సమీపిస్తోంది. దీంతో స్పీకర్ గడ్డం పసాద్‌కుమార్ వేగంగా ప్రక్రియ చేపడుతున్నారు. తాజా చర్యలు అనూహ్యమైన మలుపును తీసుకొచ్చాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన ఎమ్మెల్యేలపై డిఫెక్షన్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్పీకర్ జారీ చేసిన అదనపు నోటీసులు విచారణ ప్రక్రియను వేగవంతం చేయడం రాజకీయ వర్గాల్లో చర్చలకు దారితీశాయి.2024లో బీఆర్ఎస్‌లోని పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంతో ఫిరాయింపు వివాదం మొదలైంది. ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి (బంన్స్వాడ), కల్యాయాదయ్య (చేవెల్ల), ఎం. సంజయ్ కుమార్ (జగిత్యాల), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గుడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు), టి. ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికేపుడి గాంధీ (సేరిలింగంపల్లి), దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), తెల్లం వెంకట రావు (భద్రాచలం) బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచినా పార్టీ మారారు. బీఆర్ఎస్ నేతలు ఈ మార్పును ఫిరాయింపుగా భావించి చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ ఎటూ తేల్చకపోవడంతో గులాబీ నేతలు హైకోర్టు తర్వాత సుప్రీం కోర్టుకు వెళ్లారు. సుప్రీంకోర్టు జూలై 31, 2025 నాటి తీర్పులో స్పీకర్‌కు మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించడంతో ప్రక్రియ వేగపడింది. ఫిబ్రవరి 2025లో మొదటి నోటీసులు జారీ అయినప్పటికీ, ఎమ్మెల్యేలు తమకు బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, పార్టీ మారలేదని సమాధానాలు ఇచ్చారు. ఈ సమాధానాలు బీఆర్ఎస్ నేతలకు పంపబడిన తర్వాత, ఆ పార్టీ తరఫున జగదీశ్ రెడ్డి, కేపీ వివేకానంద, చింతా ప్రభాకర్ వంటి నేతలు రీజాయిండర్లు సమర్పించారు.ఆగస్టు 2025 చివరిలో స్పీకర్ అదనపు నోటీసులు జారీ చేసి, మరిన్ని ఆధారాలు సమర్పించమని ఆరుగురు ఎమ్మెల్యేలుసంజయ్, పోచారం, కలె యాదయ్య, తెల్లం వెంకట రావు, కృష్ణమోహన్ రెడ్డి, మహిపాల్ రెడ్డిని ఆదేశించారు.ఈ నోటీసులు డిఫెక్షన్ చట్టం (10వ షెడ్యూల్) ప్రకారం విచారణను లోతుగా చేయడానికి ఉద్దేశించబడ్డాయి. స్పీకర్ అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవేత్తల సలహాలతో ఈ చర్య తీసుకున్నారు

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com